సాక్షి
జోగుళాంబ గద్వాల
శుక్రవారం, 17, జనవరి, 2025



..రాకపోకలు నిషేధం
సింగోటం జాతర నేపథ్యంలో కృష్ణానదిపై రాకపోకలు నిషేధించారు.

వివరాలు 8లో ▸



వాహనాల బారులు
సంక్రాంతి తిరుగు ప్రయాణికులతో హైవేపై వాహనాలు బారులుతీరాయి.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
32.2/17.4

వాతావరణం
ఉదయం, రాత్రివేళలో చలి తీవ్రత పెరుగుతుంది. తెల్లవారుజామున మంచు కురుస్తుంది. చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

జోగుళాంబ సన్నిధిలో ప్రముఖులు



అలంపూర్: దక్షిణ కాశీ అలంపూర్ క్షేత్ర ఆలయాలను ప్రముఖులు దర్శించుకున్నారు. డిప్యూటీ కలెక్టర్ షర్మిల, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ సతీమణి మహాలక్ష్మి, సినీ యాంకర్ ప్రదీప్ కుటుంబ సభ్యులు గురువారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఈఓ పురేందర్ కుమార్ అర్చకులతో కలిసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం పలికారు. వీరితోపాటు ఆలయ ధర్మకర్తలు సరస్వతి, నాగశిరోమణి, మాజీ సర్పంచ్ జోగుల రవి తదితరులు ఉన్నారు.

బొల్లుగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో..

ఎర్రవల్లి: మండల కేంద్రంలోని బొల్లుగట్టు ఆంజనేయస్వామి ఆలయాన్ని గురువారం మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ సతీమణి మహాలక్ష్మి, అదనపు కలెక్టర్ షర్మిళ, టాలీవుడ్ యాంకర్ ప్రదీప్ మాతృమూర్తి మంచిరాజు భావన, పలువురు టాలీవుడ్ ప్రముఖులు సందర్శించారు. ఆంజనేయస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వేరుశనగ క్వింటా రూ.6,201

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్‌యార్డుకు గురువారం 1427 క్వింటాళ్ల వేరుశనగ రాగా, గరిష్టం రూ. 6201, కనిష్టం రూ.2806, సరాసరి రూ.4510 ధరలు పలికాయి. అలాగే, 27 క్వింటాళ్ల ఆముదాలు రాగా గరిష్టం రూ.5521, కనిష్టం రూ.4509, సరాసరి రూ.5511 ధర లభించాయి. 67 క్వింటాళ్ల వరి (సోన) రాగా గరిష్టం రూ.2466, కనిష్టం రూ.2275, సరాసరి రూ.2446 ధర పలికింది. 186 క్వింటాళ్ల కంది రాగా గరిష్టం రూ.6869, కనిష్టం రూ. 3306, సరాసరి రూ. 6869 ధరలు వచ్చాయి.

సింగోటం లక్ష్మీనృసింహుడి ప్రభోత్సవం



కొల్లాపూర్ రూరల్: మండలంలోని సింగోటం శ్రీలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి ప్రభోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి దీక్షహవనం, లక్ష్మీగణపతి హోమతర్పణం, సతీసమేత ఆదిత్యాది నవగ్రహ, ఆంజనేయ, వాస్తు, సర్వతోభద్రహవనాలు జరిపారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలను సింహవాహనంపై ఉంచి రత్నగిరి కొండ వరకు వేలాది మంది భక్తుల గోవిందనామ స్మరణ మధ్య ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ చైర్మన్ ఆదిత్య లక్ష్మణ్‌రావు, అర్చకులు పాల్గొన్నారు. అనంతరం టూరిజం శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్య ప్రదర్శనను మంత్రి జూపల్లి కృష్ణారావు తిలకించారు. అలాగే శుక్రవారం జరిగే రథోత్సవ ఏర్పాట్లు పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

నవోదయ పరీక్షకు పక్కాగా ఏర్పాట్లు

బిజినేపల్లి: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా శనివారం నిర్వహించే నవోదయ ప్రవేశ పరీక్షకు పక్కాగా ఏర్పాట్లు చేశామని, పరీక్షలను అధికారులు బాధ్యతగా నిర్వహించాలని నాగర్‌కర్నూల్ జిల్లా విద్యా శాఖ అదనపు కమిషనర్ రాజశేఖర్‌రావు అన్నారు. గురువారం బిజినేపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ప్రవేశ పరీక్ష కేంద్రాల సూపరింటెండెంట్లు, పరిశీలకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 6 వేల మందికిపైగా విద్యార్థులు నవోదయ విద్యాలయంలో 6వ తరగతి కోసం ప్రవేశ పరీక్షకు హాజరుకానున్నారని, మొత్తం 27 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసి 27 మంది సూపరింటెండెంట్లు, 27 మంది పరిశీలకులను నియమించామన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఆయా జిల్లాల పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఉంటుందన్నారు. పరీక్ష నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో నవోదయ విద్యాలయ వైస్ ప్రిన్సిపల్ జానకిరాములు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రహణం వీడేదెన్నడో..?

11 ఏళ్లుగా కొనసాగుతున్న గద్వాల ఔటర్ రింగ్ రోడ్డు పనులు

- నిధుల లేమితో ముందుకు సాగని వైనం
- అసంపూర్తి పనులతో ఆరు మండలాల ప్రజల అవస్థలు
- ఇష్టానుసారంగా వెలసిన అక్రమ నిర్మాణాలు



అసంపూర్తిగా మిగిలిపోయిన ఔటర్‌రింగ్ రోడ్డు పనులు

గద్వాల: ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 11 ఏళ్లుగా గద్వాల రింగ్‌రోడ్డు పనులు కొనసాగుతూ..నే ఉన్నాయి. ఇన్నేళ్లు పనులు ముందుకు కదలకపోయినా అటు పాలకులకు కాని, ఇటు అధికారులకు కాని చీమ కుట్టినట్లు కూడా లేదు. ఫలితంగా జిల్లాలోని ఆరు మండలాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా కర్ణాటక సరిహద్దుగా ఉన్న రాయచూరుకు వెళ్లాలంటే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న పరిస్థితి. 2013లో అప్పటి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం గద్వాల ఔటర్ రింగు రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. జమ్ములమ్మ నుంచి గద్వాల–రాయచూరు రోడ్డును కలుపుతూ 100 ఫీట్ల వెడల్పుతో 6.27 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం కోసం రూ.26కోట్లతో అంచనాలు రూపొందించారు. సర్వే పనులు పూర్తయిన అనంతరం 2014లో టెండర్లు నిర్వహించి మొదటి దశ పనులు చేపట్టారు. కొంత మేర పనులు పూర్తయినా ఆ తరువాత రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటైంది. ఈక్రమంలోనే నిధులు లేమితో పనులు పూర్తిగా నిలిచిపోయాయి.

రూ.26 కోట్లతో రింగ్‌రోడ్డు

ట్రాఫిక్ సమస్యలు అధిగమించేందుకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం గద్వాల చుట్టూ ఔటర్ రింగు రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. హైదరాబాద్‌కు వెళ్లే రహదారి మార్గంలోని జమ్ములమ్మ వద్ద నుంచి గద్వాల–అయిజ రోడ్డును కలుపుతూ గద్వాల–రాయచూరుకు వెళ్లే రహదారి వరకు 6.27 కిలోమీటర్ల మేర 100 ఫీట్ల ఔటర్ రింగు రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు రూ.26కోట్లతో అంచనాలు రూపొందించింది. ఇందులో సర్వే కోసం రూ.15 లక్షలు, భూసేకరణకు రూ.4 కోట్లు, రోడ్డు నిర్మాణం కోసం రూ.8.76 కోట్లు, ఆర్వోబి కోసం రూ.7.58 కోట్లు, వివిధ ప్రాంతాలలో స్ట్రక్చర్స్ నిర్మాణాల కోసం రూ.1.1 2కోట్లు, విద్యుత్ పోల్స్‌కు రూ.7లక్షలతో అంచనాలతో డీపీఆర్ రూపొందించి టెండర్ ప్రక్రియ చేపట్టింది. ఇందులో గద్వాల–రాయచూరు రోడ్డు మొదలుకుని గద్వాల–అయిజ వరకు రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఆ తరువాత జమ్ములమ్మ ప్రధాన రహదారి వరకు చేపట్టాల్సిన పనులు పూర్తిగా నిలిచిపోయాయి. ఇదిలాఉండగా, నడిగడ్డగా పిలువబడే అలంపూర్ – గద్వాల నియోజకవర్గాల ప్రజలకు నిత్యం వివిధ రకాల పనుల నిమిత్తం రోజుకు సుమారు 20 వేల నుంచి 40వేలకుపైనే రాకపోకలు కొనసాగిస్తుంటారు. రింగ్‌రోడ్డు పనులు పూర్తి కాకపోవడంతో గద్వాల పట్టణంలోపలి నుంచి రాయచూరు, అయిజ, హైదరాబాద్, కర్నూల్ వంటి ప్రాంతాలకు వెళ్లాలంటే వాహనదారులు తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

> **నివేదిక పంపించాం**
>
> ఔటర్‌రింగు రోడ్డు పనులకు నిధులు లేకపోవడంతో ఆటంకం ఏర్పడింది. ప్రస్తుతం పనులు మొదలు పెట్టాలంటే గతంలో వేసిన రేట్లు పెరిగిపోయాయి. ప్రస్తుత ధరలకు అనుగుణంగా నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి పంపించాం. ప్రభుత్వం నుంచి నిధులు వచ్చిన వెంటనే పనులు చేపడుతాం.
>
> – ప్రగతి, ఆర్‌అండ్‌బీ ఈఈ, గద్వాల

వెలసిన అక్రమ నిర్మాణాలు

ఇదిలాఉండగా, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్ల కాలంలో గద్వాల ఔటర్‌రింగురోడ్డు నిర్మాణ పనులకు సంబంధించి ఎలాంటి పురోగతి లేకుండా పోయిందన్న ఆరోపణలు వినవస్తున్నాయి. గత పదేళ్ల కాలంలో ఔటర్ రింగు రోడ్డు నిర్మాణం కోసం ఒక్క రూపాయిని ప్రభుత్వం విడుదల చేయలేదంటే పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతుంది. దీనికితోడు గద్వాలఔటర్ రింగు రోడ్డు ప్రాంతంలో భూముల ధరలు ఆకాశాన్ని అంటుతుండడంతో చాలా చోట్ల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైంది. ముఖ్యంగా జమ్ములమ్మ ఆలయం వద్ద ప్రభుత్వ భూములలో అక్రంగా షాపింగ్ కాంప్లెక్స్‌లు, ఇళ్ల నిర్మాణాలు, ఫంక్షన్ హాళ్లు వెలిశాయి. ఆక్రమణదారులు వీటిని దర్జాగా అద్దెకిచ్చుకుని నెలనెలా డబ్బులు వెనకేసుకుంటున్నారు. రింగురోడ్డు పనులు పూర్తిచేయాలంటే ఇక్కడ నిర్మించిన అక్రమ నిర్మాణాలను తొలగించి పనులు చేపట్టాల్సి ఉంటుంది. ఆక్రమణలపై అధికారులకు తెలిసినప్పటికీ రాజకీయ ఒత్తిళ్లతో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పారదర్శకంగా లబ్ధి

26న నాలుగు పథకాల ప్రారంభం: జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర



సమావేశంలో మాట్లాడుతున్న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, పక్కన మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, అనిరుధ్‌రెడ్డి, కలెక్టర్లు విజయేందిర(మహబూబ్‌నగర్), సంతోష్ (నాగర్‌కర్నూల్), ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి రవినాయక్

- అర్హులైన ప్రతి నిరుపేదకూ మేలు చేకూరేలా ఎంపికలు
- గ్రామ సభల్లో ఎమ్మెల్యేలు, ఇందిరమ్మ కమిటీల భాగస్వామ్యం
- మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా సమన్వయ సమావేశం
- 'రైతు భరోసా, ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల' అమలుపై దిశానిర్దేశం
- హాజరైన రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి, 5 జిల్లాల ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: 'గణతంత్ర దినోత్సవం.. జనవరి 26న రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను ప్రారంభించనుంది. ఈ సంక్షేమ పథకాలకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలి. అర్హులైన ప్రతి నిరుపేదకూ లబ్ధి చేకూరాలి' అని ఉమ్మడి పాలమూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. ప్రభుత్వం అమలు చేయనున్న పథకాలపై మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా కార్యాచరణ సమన్వయ సమావేశానికి ఆయన రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి హాజరయ్యారు. ముందుగా ఆయా జిల్లాల్లో పథకాల అమలుకు తీసుకుంటున్న చర్యలపై దామోదర సమీక్షించారు. గ్రామ, వార్డు సభలను ఎలా నిర్వహిస్తున్నారు.. అధికారుల బృందాలను ఏ విధంగా ఏర్పాటు చేస్తున్నారు వంటి వివరాలను ఆయా జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు వివరించారు. అనంతరం పథకాల సమర్థ నిర్వహణపై అధికారులతో పాటు ప్రజాప్రతినిధులకు ఆయన దిశానిర్దేశం చేశారు.

ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలి: జూపల్లి

సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి లోపాలు లేకుండా పకడ్బందీగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టాలని మంత్రి జూపల్లి ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలన కొనసాగాలని, అర్హులకు అన్యాయం జరగొద్దన్నారు. ఆన్‌లైన్‌లో టిక్ చేయకపోవడం వల్ల అర్హులు కాకుండా పోతున్నారని చెప్పారు. వ్యవసాయ యోగ్యం కాని భూములపై పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో నిశితంగా సర్వే చేయాలని.. గూగుల్ మ్యాపింగ్ ద్వారా సర్వే చేస్తున్నారా లేదా అని మంత్రి ప్రశ్నించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించొద్దని.. కొత్త పథకాల అమలులో ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని సూచించారు. వనపర్తి జిల్లా చిన్నంబావి మండలంలోని ఓ గ్రామంలో రేషన్ కార్డుల దరఖాస్తుల్లో వ్యత్యాసం వచ్చిందని ఉదహరించారు. లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి గ్రామాల్లో ఒక రోజు ముందే చాటింపు వేయించి.. గ్రామసభలు నిర్వహించాలన్నారు. గ్రామసభల్లో ఇందిరమ్మ కమిటీలు, గ్రామైక్య మహిళా సంఘాలను భాగస్వాములను చేయాలని సూచించారు. రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ప్రత్యేక అధికారి జి.రవినాయక్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, గద్వాల, వనపర్తి కలెక్టర్లు విజయేందిర బోయి, బదావత్ సంతోష్, బీఎం.సంతోష్, ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులు, మండల ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలు ఏమన్నారంటే..

- రైతు ఆత్మీయ భరోసా గొప్ప పథకమని.. దీని గురించి ఫీల్డ్ అసిస్టెంట్లు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ పథకం వర్తించని వారు నిరాశ చెందకుండా ఉపాధి పనికి వెళ్లేలా అధికారులు సూచించాలని.. మరోసారి దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అలాగే సొంత స్థలం లేని వారికి మలిదఫాలో ఇళ్లు వస్తాయని సర్ది చెప్పాలన్నారు.
- కొత్త పథకాల అమలులో అర్హుల ఎంపిక సమర్థవంతంగా జరగాలని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సూచించారు.
- ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోని వారికి కూడా ప్రభుత్వ పథకాల వర్తింపులో అవకాశం కల్పించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి కోరారు.



- ఇందిరమ్మ ఇళ్ల పథకంలో టెక్నికల్, ప్రాక్టికల్ సమస్యలు తలెత్తుతున్నాయని.. క్షేత్రస్థాయిలో వడబోసిన జాబితాను గ్రామ సభలో పెట్టాలని వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి సూచించారు.
- మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో సర్వే జరిగిన చోటే స్క్రూటినీ చేయాలని.. ఇళ్లు ఉన్నవారిని అర్హుల జాబితా నుంచి వెంటనే తొలగించాలన్నారు. ఆర్‌అండ్‌ఆర్ సెంటర్‌లో ఉన్న పేదలకు ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. పక్కనే ఉన్న కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉందని.. అక్కడి ప్రభుత్వంతో చర్చించి జూరాలకు ఐదు టీఎంసీల నీటిని వదిలేలా చూడాలని మంత్రి దామోదర రాజనర్సింహను కోరారు.



- జర్నలిస్టులు కూడా ఇందిరమ్మ ఇళ్లు అడుగుతున్నారని, ఒకసారి పరిశీలించాలని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి కోరారు. అర్హులైన వారందరికీ రేషన్‌కార్డులు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు.
- ఎస్సీ నియోజకవర్గంలో ఎక్కువ ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు మంత్రులను కోరారు.

ఎమ్మెల్యేలు క్షేత్రస్థాయిలో పాల్గొనాలి..

సంక్షేమ పథకాల అమలులో భాగంగా నిర్వహించే గ్రామసభల్లో ఎమ్మెల్యేలు, ఇందిరమ్మ కమిటీలను భాగస్వాములను చేయాలని మంత్రి దామోదర సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పథకాలను అమలు చేసేలా ముందుకుసాగాలన్నారు. ఉమ్మడి జిల్లాలో జరిగే రెండు, మూడు గ్రామసభల్లో తనతో పాటు సహచర మంత్రి జూపల్లి పాల్గొననున్నట్లు వెల్లడించారు. ఐదు రోజుల కార్యక్రమాలపై నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలకు సమాచారం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో నాలుగైదు గ్రామ సభల్లో ఎమ్మెల్యేలు పాల్గొంటే అవగాహన వస్తుందని.. అక్కడ సమస్యలను గుర్తించి ప్రభుత్వానికి విన్నవించే అవకాశం ఉంటుందన్నారు. గ్రామాల వారీగా లబ్ధిదారులు, నిధుల మంజూరుపై గణాంకాలతో కూడిన సమాచారం తెప్పించుకోవాలని.. ఆ వివరాలను గ్రామాల్లో పర్యటించే క్రమంలో ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యేలకు సూచించారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద ఉన్న వారికి పథకాల వర్తింపుపై క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు నిర్ణయం తీసుకోవాలన్నారు.

సకాలంలో పనులు పూర్తి చేయాలి



షేకుపల్లిలో కంపోస్టు పిట్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ నర్సింగరావు

ఎర్రవల్లి: గ్రామాల్లో డిసెంబర్ నుంచి మార్చి వరకు ఐదు నెలల యాక్షన్ ప్లాన్ కింద చేపట్టిన పనులను సకాలంలో పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. గురువారం ఉమ్మడి ఇటిక్యాల మండల కేంద్రంతో పాటు షేకుపల్లి, కోదండాపురం గ్రామ పంచాయతీలను ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో రూ.25,000 వ్యయంతో చేపట్టిన రూఫ్‌టాఫ్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్, రూ.86,000 వ్యయంతో చేపట్టిన పశువుల షెడ్ నిర్మాణాలు, రూ.18వేలతో చేపట్టిన కంపోస్టు పెట్టును అదనపు కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ జాబ్‌కార్డులు ఉన్న హోల్డర్లు, భూమి ఐదు ఎకరాల కన్నా తక్కువగా ఉండి పశువులు ఉన్న రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం పథకాన్ని తీసుకొచ్చిందని వివరించారు. అర్హులైన రైతులు ఈ పథకాన్ని వినియోగించుకొని లబ్ధి పొందాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ శివజ్యోతి, పిఏలు లావణ్య, హసన్, పంచాయతీ కార్యదర్శులు, ఎఫ్‌ఏలు, తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరు వరకు వాటాధనం సమకూర్చాలి



వడ్డేపల్లి సమావేశంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న చైర్మన్లు

శాంతినగర్: ఈనెల చివరి వరకు రూ.15 లక్షలు వాటాధనం సమకూర్చాలని రైతు ఉత్పత్తి దారుల సంఘం చైర్మన్లు అన్నారు. వడ్డేపల్లి రైతు వేదికలో వడ్డేపల్లి, ఇటిక్యాల, రాజోళి, ఐజ, గట్టు మండలాలకు చెందిన రైతు ఉత్పత్తి దారుల సంఘాల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘంలోని వాటాదారులు, సంఘ సభ్యులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. సెంట్రల్ సెక్టార్ స్కీంలో బాగంగా 2022లో జిల్లాలో ఐదు రైతు ఉత్పత్తిదారుల సంస్థలను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. ఐదు సంస్థలలో ఇప్పటివరకు 3 వేల మంది రైతులు సభ్యత్వం తీసుకున్నారన్నారు. సభ్యత్వం ద్వారా రూ.30 లక్షల వాటాధనం సమకూర్చామని, ఇప్పటివరకు రూ.2 కోట్ల వరకు ఇన్పుట్ వ్యాపారం జరిగిందన్నారు. 300 ఎకరాల్లో చీని, మామిడి మొక్కలు ఉచితంగా ఇచ్చామని, సభ్యత్వం తీసుకున్న రైతులకు విత్తనాలు, ఫర్టిలైజర్, బ్యాటరీ పంపులు, పరదలు, డ్రిప్పు మందులు, సోలార్ లైట్లు, కలుపు తీసే యంత్రాలు, విత్తనాలు వేసే పరికరాలు అందజేశారన్నారు. ప్రతి గ్రామంలో సంఘం తరపున షాపులు ఏర్పాటుచేయాలని, రైతులకు విత్తనాలు, ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్ అందుబాటులో వుండేలా చూడాలని, సంఘాలు వ్యాపారం చేసుకోడానికి న్యాబ్ కిసాన్ సంస్థ ప్రతి సంఘానికి రూ.6 లక్షలు లోన్ మంజూరుచేస్తుందని చైర్మన్లు వివరించారు. సమావేశంలో వడ్డేపల్లి రైతు సంఘం చైర్‌పర్సన్ దేవేంద్ర, రాజోళి వెంకటేశ్వర్లు, ఇటిక్యాల యుగంధర్‌రెడ్డి, డైరెక్టర్లు సుధాకర్‌గౌడ్, లక్ష్మికాంతరెడ్డి, హనుమంతురెడ్డి, నర్సింహులు, మహేంద్రగౌడ్, తిమ్మప్ప, సీఎస్‌ఏ ప్రతినిధులు రమేష్, వీరబాబులు పాల్గొన్నారు.

ముగిసిన శివాంజనేయస్వామి ఉత్సవాలు



పోటీల్లో గెలుపొందిన వారికి నగదు అందజేస్తున్న కమిటీ సభ్యులు

ఎర్రవల్లి/ఇటిక్యాల: మండలంలోని వావిలాల శివాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం ఘనంగా ముగిసాయి. ఉత్సవాలలో భాగంగా చివరి రోజు ఆలయంలో తెప్పోత్సవం, పల్లకీసేవ కార్యక్రమాలను కనులపండువగా నిర్వహించారు. చుట్టు ప్రక్కల ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన అంతరాష్ట్ర ఆరు పండ్ల విభాగం బండలాగుడు, పొటేళ్ల పందెం పోటీలు అట్టహాసంగా జరిగాయి.

అట్టహాసంగా పోటీలు..

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన పదుల సంఖ్యలో పొటేళ్ల పందెం పోటీల్లో పాల్గొనగా.. నంద్యాల జిల్లాలోని తిమ్మాపురంకు చెందిన హనుమ పొట్టేలు మొదటి స్థానంలో నిలిచింది. అయిజ మండలం బింగిదొడ్డికి చెందిన పరుశరాముడు పొట్టేలు రెండు, కర్నూలు జిల్లా ముళ్లగుర్తికి చెందిన భైరవ పొట్టేలు మూడు, అయిజ మండలానికి చెందిన నర్సింహ పొట్టేలు నాల్గో స్థానంలో నిలిచి వరుసగా రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు కైవసం చేసుకున్నాయి. అలాగే, ఆరుపళ్ల బండ లాగుడు పోటీల్లో కర్నూల్ జిల్లాలోని పిన్నాపురంకు చెందిన వెంకట కృష్ణయ్య వృషభాలు మొదటి స్థానంలో నిలిచి రూ.40వేలు, మండలంలోని సాతర్లకు చెందిన హర్షద్ భాషా వృషభాలు రెండోస్థానంలో నిలిచి రూ.30వేలు, వనపర్తి జిల్లాలోని పెద్దదగడకు చెందిన యశ్వంత్ యాదవ్ వృషభాలు మూడోస్థానంలో నిలిచి రూ. 20వేలు గెలుచుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీసభ్యులు రంగారెడ్డి, రామయ్య, విజయభాస్కర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మాణిక్యారెడ్డి, గ్రామ పెద్దలుపాల్గొన్నారు.

పందెంలో పోటీ పడుతున్న పొటేళ్లు





కమనీయం.. ఆదిదంపతుల కల్యాణం

- భోగ మహేశ్వరంలో ఉమామహేశ్వరుడి కల్యాణోత్సవం
- పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ దంపతులు
- గ్రామాల నుంచి తరలివచ్చిన ప్రభలు

– అచ్చంపేట

వివరాలు 8లో..

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


బొజ్జయ్య (ఫైల్)

లింగాల: మండల కేంద్రం నుంచి దారారం వెళ్లే మార్గంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఎస్ఐ నాగరాజు వివరాల మేరకు.. దారారం గ్రామానికి చెందిన గుర్రాల బొజ్జయ్య (55) లింగాల నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా.. అదుపుతప్పి రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొట్టాడు. ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకొని 108 అంబులెన్స్‌లో అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడికి భార్య అలివేల, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మృతుడి కుమారుడు గుర్రాల శ్రీశైలం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దుందుభీ వాగులో తేలిన యువకుడి శవం

- వారం రోజుల క్రితం మిస్సింగ్ కేసు నమోదు


భిక్షపతి (ఫైల్)

ఉప్పునుంతల: మండలంలోని మొల్గరకు చెందిన కుంటల భిక్షపతి (35) అనే యువకుడు గురువారం ఉదయం గ్రామ సమీపంలోని దుందుభీ వాగులో శవమై తేలాడు. ఘటనకు సంబంధించి ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు భిక్షపతి ఈనెల 9న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని అతడి తండ్రి జంగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈనెల 10వ తేదీన మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గురువారం ఉదయం గ్రామ సమీపంలోని దుందుభీ వాగులోని పందిబండ ప్రాంతంలో వ్యక్తి శవం ఉన్నట్లు గ్రామస్తులు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు అక్కడికి వెళ్లి చూడగా.. అది భిక్షపతి శవమే అని కుటుంబ సభ్యులు గుర్తించారు. పంచనామా నిర్వహించి శవాన్ని అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. వాగులో నీరు తక్కువ లోతులో పారుతూ మనిషి మునిగిపోయి చనిపోయే పరిస్థితి లేనందున అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య శోభతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రైలు కిందపడి మహిళ ఆత్మహత్య

మహబూబ్‌నగర్ క్రైం: రైలు కిందపడి గుర్తుతెలియని మహిళ ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్ఐ సయ్యద్ అక్బర్ తెలిపారు. వివరాలు.. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని టీడీగుట్ట రైల్వేగేట్ సమీపంలో గురు వారం రాత్రి 7.30ప్రాంతంలో గుర్తు తెలియని మహిళ(35) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. రైలు వస్తున్న విషయాన్ని గమనించి పరుగెత్తుకుంటూ వెళ్లి రైలు కిందపడటంతో తీవ్రగాయాలు కాగా అక్కడిక్కడే మృతి చెందింది. మృతురాలి దగ్గర ఎలాంటి ఆధారాలు లేవని మృతురాలికి సంబంధించిన కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే రైల్వే పోలీసులను సంప్రదించాలన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.




వాహనాల బారులు

సంక్రాంతికి స్వగ్రామాలకు వెళ్లిన ప్రజలు పండుగ ముగియడంతో తిరిగి పట్టణాలకు బయలుదేరడంతో జాతీయ రహదారిపై వాహనాలు బారులు తీరాయి. గురువారం అలంపూర్ చౌరస్తా సమీపంలోని పుల్లూరు టోల్‌ప్లాజా దాటడానికి వాహనదారులకు సుమారు 20 నిమిషాల సమయం పట్టింది. సాయంత్రం వేళ ఒక్కసారిగా వాహనాలు రావడంతో టోల్‌ప్లాజా వద్ద రద్దీ కనిపించింది. వాహనాలకు ఫాస్టాగ్ ఉన్నప్పటికీ భారీగా రావడంతో టోల్ దాటడానికి జాప్యం జరిగింది. – అలంపూర్

మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజుపై కేసు నమోదు

అచ్చంపేట రూరల్: పోలీసు విధులకు ఆటంకం కలిగించిన మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజుపై గురువారం అచ్చంపేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ రమేష్ కథనం ప్రకారం.. బుధవారం రాత్రి అచ్చంపేటలోని భ్రమరాంబదేవి ఆలయం వద్ద ప్రభ ఊరేగింపు సందర్భంగా బందోబస్తులో ఉన్న పోలీసులను గువ్వల బాలరాజు దుర్భాషలాడుతూ విధులకు ఆటంకం కలిగించారన్నారు. దీనిపై వీడియో, ఇతర ఆధారాల ఆధారంగా గువ్వల బాలరాజుపై కేసు నమోదు చేశామని, త్వరలోనే మరికొంత మందిపై కేసు నమోదు చేస్తామని చెప్పారు. పోలీసు విధులకు ఆటంకం కలిగిస్తే ఉపేక్షించేది లేదన్నారు. శాంతిభద్రతలకు అందరూ సహకరించాలని కోరారు.

కమనీయం.. ఆది దంపతుల కల్యాణం

- భోగ మహేశ్వరంలో ఉమామహేశ్వరుడి కల్యాణోత్సవం
- పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ దంపతులు
- గ్రామాల నుంచి తరలివచ్చిన ప్రభలు




ఉమామహేశ్వరం నుంచి పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ మూర్తులను పల్లకీలో భోగమహేశ్వరం తీసుకువస్తున్న భక్తులు

అచ్చంపేట: శ్రీశైల క్షేత్రం ఉత్తర ద్వారమైన ఉమామహేశర్వం దిగువ కొండ భోగ మహేశ్వరంలో గురువారం తెల్లవారుజామున ఆది దంపతుల కల్యాణ వేడుక అత్యంత వైభవంగా జరిగింది. ఉమామహేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని వేద మంత్రోచ్చారణ, మంగళ వాయిద్యాల నడుమ పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. బుధవారం రాత్రి ఉమామహేశ్వర క్షేత్రం నుంచి స్వామివారి ఉత్సవ మూర్తిని పల్లకీలో భోగ మహేశ్వరానికి తీసుకువచ్చారు. అచ్చంపేట భ్రమరాంబ ఆలయంతో పాటు పలు మండలాలు, గ్రామాల నుంచి ప్రభలు భోగ మహేశ్వరం చేరుకున్నాయి. కల్యాణ మండపానికి స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులు చేరుకున్న అనంతరం కల్యాణ వేడుక ప్రారంభమైంది. ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ దంపతులు పట్టువస్త్రాలు, ఆలయ చైర్మన్ బీరం మాధవరెడ్డి, ఈఓ శ్రీనివాసరావు అలంకరణ వస్త్రాలను సమర్పించారు. అనంతరం వేద పండితులు వీరయ్యశాస్త్రి, నీలకంఠశాస్త్రి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణ వేడుకను కనులారా తిలకించి తన్మయం చెందారు. అనంతరం ఉమామహేశ్వరుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

● ఉమామహేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో ప్రాంతఃకాల పూజలు నిర్వహించారు. ఉదయం 9గంటలకు గవ్యాంత పూజలు, వాస్తు పూజ, వాస్తుహోమం, రుద్రాభిషేకం, రుద్రహోమం, ప్రాతఃరౌపాసన, నిత్యబలిహరణ, సాయంత్రం 4 గంటలకు సాయమౌపాసన, బలిహరణం, నీరాజనము, మంత్రపుష్పం, నందివాహనం సేవ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, మామిళ్లపల్లి ఆలయ కమిటీ చైర్మన్ నర్సింహారావు, భ్రమరాంబ ఆలయ కమిటీ చైర్మన్ శ్రీధర్, కట్ట అనంతరెడ్డి, అనంత ఇంద్రారెడ్డి తదితరుల పాల్గొన్నారు.


కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు


పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ దంపతులు

కృష్ణానదిపై రాకపోకలకు అనుమతి నిరాకరణ


మంచాలకట్ట వద్ద కృష్ణానది ఒడ్డున పహారా కాస్తున్న రేవల్లి పోలీసులు

పెంట్లవెల్లి: ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు, నంద్యాల, ఆత్మకూర్ తదితర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు ఏటా సింగోటం లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలకు ఇంజన్ బోట్లలో కృష్ణానది దాటి వచ్చే వారు. అయితే ఆంధ్రా పోలీసులు మూడేళ్లుగా బోట్లలో నదిపై ప్రయాణాన్ని నిషేధించారు. ఈ ఏడాది కూడా అనుమతి ఇచ్చినట్టే ఇచ్చి తిరిగి రద్దు చేయడంతో భక్తులు నిరాశకు గురయ్యారు.

200 కి.మీ. ప్రయాణం..

కృష్ణానదిపై ప్రయాణానికి అనుమతిని నిరాకరించడంతో ఆయా ప్రాంతాల భక్తులు కర్నూలు, పెబ్బేరు, కొల్లాపూర్ మీదుగా సింగోటానికి చేరుకుంటారు. సుమారు 200 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేసి బ్రహ్మోత్సవాలకు ఏటా హాజరవుతున్నారు. అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని ఇంజన్ బోట్లపై ప్రయాణానికి అనుమతించాలని కోరుతున్నారు.

కోడిపందెం పోటీలో ఘర్షణ

- ఇరువర్గాలపై కేసు నమోదు

అమరచింత: మండలంలోని సింగంపేటలో కోడి పందెల వద్ద రెండు వర్గాలు ఘర్షణకు దిగి పరస్పరం దాడులు చేసుకున్న ఘటన బుధవారం చోటుచేసుకుంది. బాధితుల ఫిర్యాదు మేరకు గురువారం గ్రామంలో విచారణ చేపట్టిన పోలీసులు గొడవకు దారి తీసిన పరిస్థితులపై ఆరా తీశారు. బుధవారం గ్రామంలోని ఆలయ సమీపంలో కోడి పందెలు నిర్వహించారు. వీరిలో ఓడిపోయిన కోడి యాజమాని ముందు గెలిచిన కోడి యాజమాని తొడకొట్టి హేళన చేయడంతో ఇద్దరి మధ్య మాటమాట పెరిగి కొట్టుకున్నారు. విషయం తెలిసిన వెంటనే ఇరు కుటుంబ సభ్యులు గ్రూపులుగా ఏర్పడి రాళ్లు రువ్వుకోవడంతో రవి అనే యువకుడి కన్ను భాగంలో రక్తగాయమైంది. విషయాన్ని గతంలో జరిగిన గొడవల కారణంగా మనసులో పెట్టుకుని మళ్లీ గొడవ పడ్డారని, ఇదే విషయాన్ని పోలీసులకు సమాచారం ఇస్తూ ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నట్లు తెలిసింది. జిల్లాలో ఎక్కడ కోడి పందెలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశించినా.. ఇక్కడ మాత్రం పోలీస్ స్టేషన్‌కు మూడు కిలోమీటర్ల దూరంలో కోడి పందెలు నిర్వహించడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేశారు. ఘర్షణకు పాల్పడిన ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాద బాధితుల ఆందోళన


పట్టణంలోని పాలమూరు చౌరస్తాలో ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబీకులు

- కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలోనే మృతదేహాలు
- న్యాయం జరిగే వరకు పోస్టుమార్టం వద్దన్న కుటుంబీకులు

కల్వకుర్తి టౌన్: మండలంలోని వేపూర్‌గేటు వద్ద బుధవారం జరిగిన రోడ్డుప్రమాదంలో మృతిచెందిన బంగారయ్య (39), మహేష్ (35) కుటుంబసభ్యులు, బంధువులు న్యాయం చేయాలంటూ గురువారం పట్టణంలోని పాలమూరు చౌరస్తాలో ఆందోళన చేపట్టారు. వీరికి ఎమ్మార్పీఎస్ నాయకులు సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఇద్దరి మృతికి కారణమైన కారు యజమానిని తమ ముందుకు తీసుకురావాలని పట్టుబట్టారు. పోలీసులు అతడిని వెనకేసుకొస్తున్నారని.. అజాగ్రత్తతోనే ప్రమాదం జరిగిందని ఆరోపించారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకు నిరసన కొనసాగిస్తామంటూ, మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వ హించకూడదని రోడ్డుపై బైఠాయించారు. ఫిర్యాదు అందితే తప్పా పోస్టుమార్టం నిర్వహించడానికి వీలుకాదని పోలీసులు చెబుతున్నారు.

ఎమ్మెల్యే హామీతో ..

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అక్కడకు చేరుకొని బాధిత కుటుంబాలను పరామర్శించారు. న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ కూడా బాధిత కుటుంబాలను పరామర్శించారు.

రాకపోకలకు అవస్థలు..

హైదరాబాద్ చౌరస్తాలో లారీ బోల్తా, పాలమూరు చౌరస్తాలో బాధిత కుటుంబీకుల నిరసనతో రెండు ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ జాం కావడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కాలనీల్లోని ఇరుకు రోడ్ల మీదుగా రాకపోకలు సాగించారు.

ట్రాక్టర్‌ను దగ్ధం చేసిన దుండగులు

మరికల్: మండలంలోని పూసల్‌పహాడ్ గ్రామంలో గుర్తుతెలియని దుండగులు ట్రాక్టర్‌ను దగ్ధం చేశారు. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన సుదర్శన్ ట్రాక్టర్‌తో వరినాట్ల కోసం కేజీ వీల్స్ ఎక్కించి పనులు చేయించాడు. వరినాట్లు ముగియడంతో బుధవారం వాటిని తొలగించి టైర్లు ఎక్కించి తన వ్యవసాయ పొలం వద్ద ట్రాక్టర్ పెట్టాడు. అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని దుండగులు ట్రాక్టర్‌లో ఉన్న డీజిల్‌ను తీసి దానిపై పోసి నిప్పంటించారు. తెల్లవారుజామున పొలానికి వెళ్లిన రైతు దగ్ధమైన ట్రాక్టర్‌ను చూశాడు. రూ.10లక్షల విలువ చేసే ట్రాక్టర్‌ను దగ్ధం చేసినవారిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



కల్లు సీసాలో పాము



బిజినేపల్లి: నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని లట్టుపల్లిలో కల్లుసీసాలో పాము కనిపించడం కలకలం సృష్టించింది. స్థానికులు కథనం ప్రకారం లట్టుపల్లి పరిధిలోని ఎర్రకుంట తండాకు చెందిన మాన్యనాయక్ గురువారం సాయంత్రం స్థానిక కల్లు దుకాణం వద్ద కల్లు సేవించడానికి వెళ్లాడు. అతను ఓ కల్లు సీసా కొనుగోలు చేసి, తాగేందుకు సిద్ధం అవుతుండగా.. సీసాలో ఏదో ఉన్నట్లు కనిపించింది. దీంతో వెంటనే పారబోయడంతో అందులో నుంచి చనిపోయిన ఓ పాము పిల్ల బయటపడింది. దీంతో మాన్యనాయక్ దుకాణదారుడితో వాగ్వాదం చేశాడు. కాగా.. అక్కడి ఉన్నవారు సర్ది చెప్పినట్లు తెలిసింది. ఈ ఘటనపై అబ్కారీ ఎస్సై సతీష్‌రెడ్డి వివరణ కోరగా.. ఈ విషయం ఇప్పటి వరకు తమ దృష్టికి రాలేదని, తక్షణమే లట్టుపల్లి కల్లు దుకాణం వద్ద నమునా సేకరించి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ఉరేసుకొని వ్యక్తి బలవన్మరణం

పాన్‌గల్: ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన మండలంలో గురువారం చోటుచేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ చంద్రశేఖర్ తెలిపిన వివరాలు.. మల్లాయిపల్లికి చెందిన వెంకటేశ్వర్‌రెడ్డి(39) హైదరాబాదులో క్యాటరింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సంక్రాంతి సందర్భంగా గ్రామానికి వచ్చాడు. బుధవారం రాత్రి కుటుంబీకులతో కలిసి భోజనం చేసి నిద్రించారు. గురువారం ఉదయం గదిలో నిద్రించిన అతడు తలుపులు తీయలేదు. వారు వెనుకవైపు నుంచి గదిలోకి వెళ్లిచూడగా ఫ్యాన్‌కు ఉరేసుకొని వేలాడు తూ కనిపించాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

ఇచ్చిన డబ్బులు అడిగితే ప్రాణం తీశారు

పండుగ దావత్ అంటూ వాగులో స్నేహితుల మందు పార్టీ

- గతంలో ఇచ్చిన పాత అప్పు అడగడంతో ఆగ్రహం
- కర్రతో కొట్టడంతో రక్త గాయాలు
- ఎవరూ పట్టించుకోకపోవడంతో నిద్రలోనే మృతి
- నారాయణపేట జిల్లా భక్తిమళ్లలో విషాదం


మృతుడు రాములు(ఫైల్)

కోస్గి: పండుగ దావత్ పేరుతో తప్పతాగిన నలుగురు స్నేహితులు గతంలో అప్పుగా ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని అడగడంతో తాగిన మైకంలో తోటి స్నేహితుడనే విషయం మరిచిపోయి మూకుమ్మడిగా దాడి చేశారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన సదరు వ్యక్తి మృతిచెందిన సంఘటన నారాయణపేట జిల్లా గుండుమాల్ మండలంలోని భక్తిమళ్లలో చోటుచేసుకుంది. వివరాలిలా.. గ్రామానికి చెందిన రాములు(40) స్థానికంగా ఓ డైరీ ఫాంలో పనిచేసుకుంటూ తన ముగ్గురు పిల్లలు, తల్లిని పోషించుకుంటున్నాడు. అదే గ్రామానికి చెందిన అతని స్నేహితులు కృష్ణ, అంజి, పురుషోత్తం సంక్రాంతి పండుగ నేపథ్యంలో దావత్ చేసుకుందామని ఈ నెల 15న రాములుతో కలిసి గ్రామ శివారులోని వాగులోకి వెళ్లారు. కాగా గతంలో రాములు భార్య దగ్గర కృష్ణ రూ.5 వేలు అప్పు తీసుకున్నాడు. రాములు భార్య ఆరు నెలల క్రితమే అనారోగ్యంతో మృతిచెందింది. నా భార్య చనిపోయి ఆరు నెలలైన తీసుకున్న అప్పు ఇంకా ఇవ్వలేదన్నాడు. పండుగ దావత్‌లో పాత అప్పు అడగడం సరి కాదని మిగిలిన ఇద్దరు స్నేహితులు సైతం రాములుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గొడవ పెద్దగా మారడంతో ముగ్గురు కలిసి రాములుపై కర్రతో దాడి చేశారు. దెబ్బలకు స్పృహ కోల్పోయిన రాములును ముగ్గురు స్నేహితులు బైక్‌పై ఎక్కించుకొని గ్రామంలోకి వచ్చి.. మందు ఎక్కువైందని కుటుంబ సభ్యులను నమ్మించి అతని ఇంట్లోనే దుప్పటి కప్పి పడుకోబెట్టి వెళ్లిపోయారు. అతని తల్లి, పిల్లలు గమనించకపోవడంతో నిద్రలోనే రాములు మృతి చెందాడు. గురువారం ఉదయం నిద్రలేపేందుకు ప్రయత్నించగా అసలు విషయం బయట పడింది. రక్త గాయాలు గుర్తించి గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో అతన్ని ప్రైవేట్ వాహనంలో కోస్గి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా ఈ విషయంలో ఎలాంటి కేసు నమోదు కాకుండా గ్రామంలో కొందరు పెద్దలు శవ పంచాయితీ నిర్వహించి బాధిత కుటుంబానికి రూ.3 లక్షలు చెల్లించాలని నిర్ణయించినప్పటికీ విషయం బయటకు పొక్కడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలతో రోదిస్తున్న రాములు తల్లి మొగులమ్మ

అనాథలైన ముగ్గురు పిల్లలు

రాములు గతంలో భార్య సువర్ణ, ముగ్గురు పిల్లలతో కలిసి హైదరాబాద్‌లో కూలీ పనులతో జీవనం సాగించేవాడు. భార్య సువర్ణకు క్యాన్సర్ రావడంతో భార్య చికిత్స కోసం అప్పులు చేశాడు. వ్యాధి నయం కాకపోవడంతో భార్య ఆరు నెలల క్రితమే మృతిచెందింది. గ్రామంలోనే ఓ వ్యక్తి డైయిరీ ఫాంలో పని చేస్తూ తన ముగ్గురు పిల్లలు, తల్లిని పోషించుకుంటున్నాడు. తాజాగా స్నేహితుల దాడిలో రాములు సైతం మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అనారోగ్యంతో తల్లిని, దాడిలో తండ్రిని కోల్పోయిన ముగ్గురు పిల్లలు జానకి, పావని, అఖిల్ అనాథలుగా మారారు. ఓ పక్క శవ పంచాయతీ కొనసాగుతుండగా మరోపక్క పిల్లలతో కలిసి రాములు తల్లి మొగులమ్మ చేసిన రోదనలు పలువురిని కంటతడి పెట్టించాయి. ఈ ఘటనపై రాములు తల్లి మొగులమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాలరాజు తెలిపారు.


గ్రామంలో రాజీ కోసం కొనసాగిన శవ పంచాయితీ

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు


బండ లాగుతున్న ఎద్దులు

కోడేరు: సంక్రాంతి రైతు సంబరాల్లో భాగంగా మండల కేంద్రంలో అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. ఈ పోటీల్లో 15 జతల వృషభాలు పాల్గొన్నాయి. ముగింపు కార్యక్రమం గురువారం నిర్వహించగా ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతపురం జిల్లా నారాయణపురం మహ్మద్ ఫరీద్ ఎద్దులు మొదటి బహుమతిగా రూ.80 వేలు, నంద్యాల జిల్లా పీఆర్‌పల్లెకు చెందిన ఎద్దులు రెండో బహుమతిగా రూ.60 వేలు, నాగర్‌కర్నూల్ జిల్లా యాదిరెడ్డిపల్లికి చెందిన అఖిలేశ్వర్‌రెడ్డి ఎద్దులు తృతీయ బహుమతిగా రూ.50 వేలు గెలుచుకున్నాయి. అలాగే అనంతపురం జిల్లా మేడుమాకులపల్లికి చెందిన తిరుపాల్‌రెడ్డి ఎద్దులు నాలుగో బహుమతిగా రూ.40 వేలు, అనంతపురం జిల్లా గార్లదిన్నెకు చెందిన రమేశ్ ఎద్దులు 5వ బహుమతిగా రూ.30 వేలు, వనపర్తి జిల్లా పెద్దదగడకు చెందిన గోపాలకృష్ణ ఎద్దులు 6వ బహుమతిగా రూ.20 వేలు, కర్నూలు జిల్లా గుడికల్‌కు చెందిన దాసు ఎద్దులు 7వ బహుమతిగా రూ.15 వేలు, నంద్యాల జిల్లా రామతీర్థం గ్రామానికి చెందిన నాగరాజు ఎద్దులు 8వ బహుమతిగా రూ.10 వేలతో పాటు జ్ఞాపికలు మంత్రి జూపల్లి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. సంక్రాంతి అంటేనే వృషభరాజుల పండుగని, సీఎం రేవంత్‌రెడ్డి రైతు సంక్షేమానికి ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొత్త రాంమోహన్‌రావు, జగదీశ్వర్‌రావు, రవీందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, చలపతిరావు, మాజీ కో–ఆప్షన్‌సభ్యుడు అబ్దుల్ ఖరీం, చామంతిరాజు, తిరుపతయ్య, పొండేళ్ల తిరుపతయ్య, మాజీవార్డు సభ్యులు రాజు, రామకృష్ణ, శరత్, ఇమ్రాన్, బాబు పాల్గొన్నారు.